డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సిద్దిపేట టౌన్: మొక్క నాటుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్: వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న సీఐ ఉపేందర్

దుబ్బాక: తిమ్మాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు

సిద్దిపేట టౌన్, జూన్ 24: డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దామని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇందిరానగర్ హైస్కూల్ ఆవరణలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. సిద్దిపేట టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సహస్ర, సిటిజన్ పాఠశాలలో విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సైలు విజయ్‌కుమార్, కిరణ్, పోలీసు సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరన్నపేటలో...

చేర్యాల, జూన్ 24: డ్రగ్స్ మహమారిని తరిమికొట్టి డ్రగ్స్‌రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామని ఎస్ఐ నిరేష్ కోరారు. మండలంలోని వీరన్నపేటలో మంగళవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో...

కొమురవెల్లి, జూన్ 24: మారక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని ప్రొబిషనరీ ఎస్సై సమత, ఏఎస్సై సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి, జూన్ 24: గ్రామీణ పల్లెల్లోని యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు, గంజాయికి, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలు కావొద్దని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇర్కోడ్ మోడల్ పాఠశాలలో...

సిద్దిపేట, జూన్ 24: డ్రగ్స్ మహమ్మారిని తరిమేసి డ్రగ్స్‌రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి అన్నారు. మంగళవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులతో ఇర్కోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంతో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొబిషనరీ ఎస్ఐ సౌజన్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేబర్తి హైస్కూల్‌లో...

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 24: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులు సూచించారు. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తి హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం బాకి చంద్రభాను అధ్యక్షతన 'గంజాయి వద్దు-ఆరోగ్యమే ముద్దు' అనే నినాదంతో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సువర్ణ, ఎంఈవో వరదరాజు, టీచర్లు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాకలో...

దుబ్బాక, జూన్ 24: మారక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వారోత్సవాలలో భాగంగా మంగళవారం దుబ్బాకలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తిమ్మాపూర్, హబ్షీపూర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్సై గంగరాజు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బెజ్జంకిలో...

బెజ్జంకి, జూన్ 24: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్ఐ తిరుపతిరెడ్డి కోరారు. మండల కేంద్రమైన బెజ్జంకిలో బాలుర, బాలికల, కేజీబీవీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌రావు, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లి: వీరన్నపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిరేష్

మద్దూరు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులు

బెజ్జంకి: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

'పల్లా'కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

చేర్యాల: ఎమ్మెల్యే పలా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కొమురవెల్లి బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూన్ 24: ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి దవాఖానలో వైద్యచికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ కొంగరి గిరిధర్, చేర్యాల టౌన్ యూత్ అధ్యక్షుడు యాట భిక్షపతి ఉన్నారు. అంతకుముందుకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బొంగు రాంరెడ్డి ఉన్నారు.

కొమురవెల్లి మండలం నుంచి...

కొమురవెల్లి, జూన్ 24: ఇటీవల ప్రమాదశాత్తు గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మండల ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొంగు రాజేందర్‌రెడ్డి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులు గౌడ్, బుడిగె గురువయ్యగౌడ్, కొమురవెల్లి ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మాజీ యూత్ మండలాధ్యక్షుడు పుట్ట కనకరాజు, గజ్జె వెంకటేశ్, ఫోటో రమేశ్, కడెం కరుణాకర్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

చిన్నకోడూరు, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతుభరోసా పేరిట రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్వీ చిన్నకోడూరు మండల నాయకులు గొల్లపల్లి రాజశేఖర్‌రెడ్డి, మన్న ఆనంద్ ఆరోపించారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్ల రైతుభరోసా సాయం ఎగ్గొట్టి ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదమన్నారు.

సంబురాలు జరుపుకోవడం సిగ్గుచేటు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 24: రైతులకు రుణమాఫీ చేయకుండా రైతుభరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు జరుపుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు యాదగిరి విమర్శించారు. మంగళవారం నాడాయన విలేకరులతో మాట్లాడుతూ సర్కార్ రెండు పంటలకు పూర్తి స్థాయిలో రైతుభరోసా సాయం అందించలేదని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ తన సత్తాను చాటనుందని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళన

బ్రిడ్జిపై ఆందోళన చేపడుతున్న సీపీఎం నేతలు

చేర్యాల, జూన్ 24 : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామ సమీపంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశాడని, వెంటనే పనులు ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బ్రిడ్జి నిర్మాణ పనులను సీపీఎం నాయకులు పరిశీలించి ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయితే 10 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీపీఎం పోరాటం ఫలితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.80కోట్లు మంజూరు చేసిందని, సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం కావడంతో పనులు పూర్తికాకపోతే మండల కేంద్రంతో పాటు 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అరుణ్‌కుమార్, గ్రామశాఖ కార్యదర్శి సత్తయ్య, నాయకులు యాదగిరి, మహిపాల్, బుచ్చయ్య, ఆంజనేయులు, బాబు, ప్రశాంత్, నాగరాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలి

- సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన

సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకులు

సిద్దిపేట, జూన్ 24: ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలని, పాలస్తీనా ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ఆపాలని, అమెరికా సామ్రాజ్యవాదం పట్ల భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడి డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబు దాడులను ఖండిస్తూ అఖిల భారత వామపక్షాల పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా దాడులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, సత్తిరెడ్డి, భాస్కర్, వెంకటమావో, రవికుమార్, అరుణ్ కుమార్, బాలనర్సయ్య, శిరీష, నాయకులు కనకయ్య, రవీంద్రాచారి, సంజీవ్ కుమార్, రవీందర్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో కోత.. ట్యాంకర్లతో కొనుగోలు

మిషన్ భగీరథకు పురుడుపోసుకున్న గజ్వేల్‌లో నీటికష్టాలు

గజ్వేల్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్న ఓ ఇంటి యాజమాని

గజ్వేల్, జూన్ 24: పట్టణ వాసులకు సరిపోను మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయకపోవడంతో నిత్యం ప్రజలు నీళ్ల కోసం గోసపడుతున్నారు. మిషన్ భగీరథ పథకానికి పుడురుపోసుకున్న గజ్వేల్‌లో నీటి కష్టాలు తప్పడం లేదు. గత పదేండ్ల క్రితం మున్సిపల్ అధికారులు కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం మళ్లీ అవే పరిస్థితులు వచ్చాయని పట్టణవాసులు వాపోతున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే మున్సిపాలిటీలో ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లను కొనుగోలు చేస్తున్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో 11వేలకు పైగా గృహాలుండగా 55వేల వరకు జనాభా ఉంటుంది. అయితే గతవారం రోజులుగా మున్సిపాలిటీలో నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం కొండపాక సంప్ వద్ద పంపులు రిపేర్ రావడంతో వాటిని అధికారులు త్వరగా వినియోగంలోకి తీసుకురాక పోవడంతో కూడా నీటి సమస్య తలెత్తుతుంది. అదేవిధంగా మండల పరిధిలోని బయ్యారం, బెజగామ, అరెపల్లి గ్రామాలకు ప్రతి రోజు సుమారుగా లక్ష లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సిన అధికారులు అందులో సగమే సరఫరా చేయడంతో సరిపడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో మంచినీటి కష్టాలు ప్రజలకు తప్పడం లేదు.

తాగునీరు అందించండి

నారాయణరావుపేట, జూన్ 24: మండల పరిధిలోని మాటిండ్లలో దండబోయిన వాడకు వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోయాయి. గత 10 రోజుల నుండి మిషన్ భగీరథ తాగునీరు రాక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపి పాడైపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హైమావతి

కొండపాక(కుకునూర్‌పల్లి), జూన్ 24: రైతు భరోసా సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇచ్చిన సందేశాన్ని వీక్షించేందుకు కలెక్టర్ హైమవతి మండల పరిధిలోని దుద్దెడ రైతు వేదికలో మంగళవారం పాల్గొన్నారు. అదేవిధంగా కుకునూర్‌పల్లి రైతు వేదికలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఏవో రాధిక, ఏవో గోవిందరాజు, ఏఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలి

పబ్లిక్ టాయిలెట్స్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కమిషనర్, తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 24: పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ కోరారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లోని పబ్లిక్ టాయిలెట్స్‌ను మంగళవారం కమిషనర్ స్వయంగా శుభ్రం చేశారు. ఆయనతో పాటు సిబ్బంది చీపుర్లతో శుభ్రంచేసి, బ్లీచింగ్ చల్లారు. ప్రజలు స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు అధికారులు జలంధర్, సాంబరాజు, భవాని, శారద, వెంకటేశ్, శివకుమార్, జవాన్ ప్రభాకర్ ఉన్నారు.

ఆర్థికాభివృద్ధికి వేదిక ఉత్పత్తుల ప్రదర్శన

ఎగ్జిబిషన్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట, జూన్ 24: ఉత్పత్తుల ప్రదర్శన మహిళా స్వయం సహాయక బృందాలకు ఆర్థికాభివృద్ధికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్జీవోస్ భవన్‌లో ఒక మార్పు అభివృద్ధికి మలుపు-స్వచ్ఛతపై తొలి అడుగు అనే థీమ్‌తో స్వయం సహాయక బృందాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. స్వయం సహాయక బృందాలు ప్లాస్టిక్ నిషేధం వ్యర్థాల నిర్వహణ.. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంలో మహిళలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్వయం సహాయక బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించొద్దు

మాట్లాడుతున్న ఏడీఏ పద్మ

చిన్నకోడూరు, జూన్ 24: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు రైతులకు విక్రయిస్తే ఎరువుల దుకాణాల డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ పద్మ హెచ్చరించారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులోని రైతు వేదికలో ఎరువుల దుకాణాల డీలర్లతో మంగళవారం వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అమ్మకాలు తప్పకుండా ఈ-పీఓఎస్‌లో లావాదేవీలు జరపాలన్నారు. ఆమె వెంట ఏవో జయంత్ కుమార్, ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని మహిళల బతుకమ్మ ఆట

వర్షాలు కురువాలి... చెరువులు నిండాలి... పంటలు పండాలి... అందరూ మంచిగా బతుకాలి... వాన దేవుడా వర్షాలు కురిపించూ అంటూ మంగళవాం మండల కేంద్రమైన అక్కన్నపేటలో మహిళలు బతుకమ్మ ఆడారు. వరుణుడిపై తీరొక్క పాటలు పాడారు. కాగా, కొన్ని రోజులుగా వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అరుద్ర కార్తెలో వానలు పడకపోతే ఖరీఫ్ సగం పోయినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - అక్కన్నపేట, జూన్ 24

తహసీల్ ఎదుట గౌడ కులస్తుల ధర్నా



కోహెడ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గౌడ కులస్తులు

కోహెడ, జూన్ 24: కోహెడ మండల తహసీల్ కార్యాలయం ముందు రాంచంద్రాపూర్ గ్రామ గౌడ సంఘం నాయకులు మహిళలు మంగళవారం ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి, రహదారికి ఇద్దరు దారికి అడ్డంగా రాళ్లు వేసి అడ్డుకున్నారన్నారు. ఈ విషయంలో తహసీల్దార్, ఆర్డీవోకు విజ్ఞప్తి చేయగా స్థలాన్ని సర్వే చేయించారని తెలిపారు. తహసీల్ కార్యాలయం నుండి ఆర్డీవోకు తప్పుడు సమాచారం పంపించారని ఆరోపిస్తూ మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆర్ఐ, సర్వేయర్లను సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ అభిలాష్, తహసీల్దార్లు సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వటంతో ధర్నా విరమించుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సిద్దిపేట, జూన్ 24: రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి క్రీడా పాఠశాలలో సీట్లు సాధించాలని జిల్లా క్రీడలు యువజన అధికారి జంగాపల్లి వెంకట నరసయ్య సూచించారు. మంగళవారం సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో ద్దిపేట జిల్లాకు విశిష్ట స్థానం ఉందని, భవిష్యత్తులో మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థి దశ నుంచి క్రీడల్లో మంచి శిక్షణ పొందాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు నిలయమైన క్రీడా పాఠశాలలో ప్రవేశాలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాటరీ టెస్ట్ ఎత్తు, బరువుతో పాటు 30 మీటర్స్ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్, షటిల్ రన్, 800 మీటర్స్, అంశాలలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ పరిశీలకులు ఫణీంద్ర, సిద్దిపేట అర్బన్ ఎంఈవో రాజ ప్రభాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పన్యాల రామేశ్వర్‌రెడ్డి, పాతూరి సుజాత, గాదిరి భిక్షపతి, బండారుపల్లి శ్రీనివాసులు, కాటం శ్రీనివాస్, క్రీడాశాఖ సిబ్బంది వెంకట్ గౌడ్, అర్జున్ పాల్గొన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ చేయుచున్న కాటం శ్రీనివాసును జిల్లా క్రీడా శాఖ, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నిరక్షర్యాతపై యుద్ధంచేద్దాం

శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ దేశిరెడ్డి

నంగునూరు, జూన్ 24: నిరక్షరాస్యతపై యుద్ధం చేసి ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో దేశిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు, సెర్ప్ వీవోఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో చదవడం, రాయడం రాని వారి సర్వే జూలై 7లోపు పూర్తి చేయాలన్నారు. సర్వే ద్వారా గుర్తించిన వారిని డిసెంబర్‌లోపు సంపూర్ణ అక్షరాస్యులుగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, ఉల్లాస్ ట్రైనర్లు ముజామిల్, పెంటయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న ఏఈవో పూజ

చేర్యాల, జూన్ 24: ప్రతి రైతు తమ భూమిలో భూసార పరీక్షలు విధిగా చేయించుకోవాలని ఏఈవో పూజ సూచించారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌లో భాగంగా ఎంపికైన మండలంలోని రాంపూర్‌లో పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో మంగళవారం భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను ఆమె సేకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కనకయ్య, మాజీ సర్పంచ్ నిమ్మ నర్సిరెడ్డి, బండరాములు, పరమేశ్వర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వంట షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

గజ్వేల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్‌పై ఎగిరిపోయిన రేకులు (ఫైల్)

గజ్వేల్, జూన్ 24: కిచెన్ షెడ్డులో వంట చేయడానికి అవస్థలు పడుతున్నామని పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. గత కొద్దిరోజుల క్రితం వీచిన గాలి దుమారానికి కిచెన్ షెడ్డు రేకులు ఎగిరిపోయాయని, అప్పటి నుంచి విద్యార్థులకు వంట చేయడం ఇబ్బందిగా మారుతుందన్నారు. 400మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో వంట సమయంలో వర్షం కురిస్తే నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, జూన్ 24: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్ పోస్టులు (4) ఖాళీగా ఉన్నాయని ఎంఈవో రచ్చ కిష్టయ్య మంగళవారం తెలిపారు. హెడ్‌కుక్(1), అసిస్టెంట్